## క్లుప్తంగా

### తాళ్లపూడిలో బాల దుర్గమ్మ గ్రామోత్సవం



తాళ్లపూడిలో బాలదుర్గమ్మ ఊరేగింపు

**తాళ్లపూడి:** శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా తాళ్లపూడి వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో సోమవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా బాలదుర్గమ్మ తల్లి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రాక్టర్‌పై పూలతో అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి గరగ నృత్యాలు, మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. కమిటీ సభ్యులు దుర్గారావు బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

### త్యాజంపూడిలో కొండచిలువ హల్‌చల్



హతమార్చిన 13 అడుగుల కొండ చిలువ

**దేవరపల్లి:** మండలంలోని త్యాజంపూడి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం కొండ చిలువ హల్ చల్ చేసింది. దానిని చూసి ప్రజలు హడలెత్తారు. గ్రామ శివార్లలోని బంగారమ్మ చెరువు వద్ద 13 అడుగుల పొడవైన కొండ చిలువ రోడ్డు దాటుతుండడాన్ని చూసిన జనం భయంతో పరుగులు తీశారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు ధైర్యం చేసి కొండ చిలువ వెంటపడి హతమార్చారు. గ్రామంలో కొండ చిలువను చూడడం ఇదే మొదటిసారి అని పంచాయతీ ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్ తెలిపారు.

### చాగల్లులో అన్నసమారాధన

**చాగల్లు:** దసరా మహోత్సవాల ముగింపులో భాగంగా చాగల్లు కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిద్దరినీ సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### బైండోవర్ నిందితులకు జరిమానా

**దేవరపల్లి:** స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గతంలో సారా కేసుల్లో నలుగురిని పట్టుకుని మండల మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ కేసులు నమోదు చేశామని సీఐ డి.సుధ తెలిపారు. అయినప్పటికీ ఆ నలుగురు నిందితులు మళ్లీ నేరం చేస్తున్నందున సోమవారం గోపాలపురం మండల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, నిందితులకు జరిమానా విధించినట్టు సీఐ సుధ తెలిపారు. గోపాలపురం మండలం బుచ్చియపాలెంకు చెందిన పంది లక్ష్మణరావు, పులిబోయిన నాగరాజు, చిక్కాల వెంకట నాగు, బొమ్మన కొండయ్యలకు మండల మెజిస్ట్రేట్ బి.రవీంద్ర ఒకొక్కరికి రూ.20 వేల చొప్పున జరిమానా విధించినట్టు ఆమె వివరించారు.

### దీపావళి సామగ్రి స్వాధీనం

**గోపాలపురం:** అనధికారికంగా నిల్వ చేసిన దీపావళి సామగ్రిని సోమవారం మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని యర్రవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం ఎస్సై కె.సతీష్ కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన శీలం వీరబాబు, అనిపెద్ది బంగారు బాబు అనే వారి నుంచి రూ 23,500 విలువైన దీపావళి మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ అరెస్టు చేశారు. అలాగే మండలంలోని జగన్నాథపురం శివార్లలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు. అలాగే మండలంలోని పెద్దాపురం గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి పందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,200 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### హైదరాబాద్‌కు మరో సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ నడపాలి

**నిడదవోలు:** నిడదవోలు పరిసర వాసుల సౌకర్యార్థం ఇక్కడి నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు మరో సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ నడపాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు వివిధ సంఘాల నాయకులు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు జువ్వల రాంబాబు, బచ్చు సుమన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వున్న హైదరాబాద్ సర్వీస్ యర్నగూడెం వరకూ ఉన్న ప్రయాణికులకు సరిపోతోందన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులు వయా విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళుతున్నారని, ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. దీంతో మరో సూపర్ లగ్జరీ బస్ నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొక్కరాల సుదీప్, గెద్దం కుమార్, అంబటి పుల్లారావు, ఈ. వెంకన్న, నానీ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షతో వైద్యంలో సరికొత్త అధ్యాయం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- జగనన్న సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- నల్లజర్ల మండలంలో ముగిసిన శిబిరాలు



చాగల్లు మండలం చిక్కాల శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



నల్లజర్ల మండలం కవులూరు శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**నల్లజర్ల:** జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని కవులూరు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కవులూరు, నబీపేట సర్పంచులు మద్దిపాటి శ్రీనివాసరావు, గోతం సత్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గారపాటి ధనలక్ష్మి ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకట్రావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. మండలంలో సురక్ష వైద్య శిబిరాలు ముగిశాయి. దాంతో రోగులకు సేవలు అందించిన వైద్యులను, ఆరోగ్య శాఖ సిబ్బంది, అధికారులకు ఎమ్మెల్యే అభినందించారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలో 9 వైద్య శిబిరాలు నిర్వహించి 5,259 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. 198 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఇక పోతవరం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన 11 వైద్య శిబిరాల్లో 5,987 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో 66 మందిని రిఫరల్ ఆసుపత్రులకు పంపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సర్పంచులు మద్దిపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ గారపాటి ధనలక్ష్మి, కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, గోతం కృష్ణాయాదవ్, ముప్పిడి వెంకటరత్నం పాల్గొన్నారు.

**మోర్తలో 515 మందికి..**

**ఉండ్రాజవరం:** మండలంలోని మోర్త–2 సచివాలయం పరిధిలోని జెడ్పీ హైస్కూల్ వద్ద సర్పంచ్ చిటికెన సుజని ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీకి చెందిన ఆర్.ఉషాదేవి (జనరల్ మెడిసిన్), ఎస్‌జే ఇర్ఫాన్ (జనరల్ మెడిషన్), షణ్ముక వర్మ (జనరల్ ఎండీ), శాంతి కమల (నేత్ర వైద్యం) సుమారు 515 మందికి ఈ శిబిరంలో వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్ల నిమిత్తం 10 మందికి ఆర్థోపెడిక్ సంబంధించి ఒకరిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. వైద్య శిబిరాన్ని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సందర్శించారు. ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలతో పాటు రోగుల మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కనక రాజు, వైస్ సర్పంచ్ దాపర్తి రాం సందీప్, ఎంపీటీసీ సభ్యురాళ్లు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు పాల్గొన్నారు.

**చిక్కాలలో 569 మందికి..**

**చాగల్లు:** మండలంలోని చిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, సర్పంచ్ కొయ్యే మణి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఆర్థోపెడిక్, డెంటిస్ట్, జనరల్, గైనిక్, ఆప్తమాలజీ విభాగాల వైద్య నిపుణులు 569 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు అవసరమైనవారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్‌కెకే కాశీమ్, వైద్య ఆరోగ్య సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### జగనే మళ్లీ గెలవాలంటూ పట్టిసీమలో పూజలు



పట్టిసీమలో వీరేశ్వరస్వామి వారికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**తాళ్లపూడి:** ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యేగా తానేటి వనిత మళ్లీ విజయం సాధించాలని ప్రార్థిస్తూ సోమవారం పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి నది మధ్యలో వెలసిన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో తాళ్లపూడి మండలం పెద్దేవానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు చేశారు. ఆ పార్టీ నాయకులు తోట రామకృష్ణ, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. జగనన్న అభీష్టం మేరకు 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ అభిషేకాలు, పూజలు చేశారు. ఈ పూజల్లో ఆ పార్టీ నాయకులు మైలవరపు రాధాకృష్ణ, చేమకూరి సత్యనారాయణ, యండపల్లి నాగేంద్ర, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు, కానూరులలో గడప గడపకూ ..



చాగల్లులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత

**చాగల్లు:** నవ రత్నాల పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు సచివాలయం –2 పరిధిలో సోమవారం ఆమె గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్ర కుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వర రావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, సచివాలయం కన్వీనర్ బొర్రా రజనీ ప్రసాద్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**రూ. రెండు వేల కోట్లతో అభివృద్ధి**

**పెరవలి:** గత నాలుగున్నరేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఇంత అభివృద్ధి మరెక్కడా జరగలేదని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కానూరులో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత మేలు చేసినా ఈ గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మవద్దన్నారు. పలు అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా కానూరు గ్రామ ప్రజలకు రూ.35 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ ఎస్సీ ఎల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

**దేవరపల్లి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ కోరారు. సీఐటీయూ మండలశాఖ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో జరిగింది. సీఐటీయూ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ టీపీ లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడారు. గత ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని ఆశ పెట్టి నిరుద్యోగులను మోసగించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, స్కిల్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, కె.రత్నాజీ, వివిధ అనుబంధ సంఘాల నాయకులు గుంటూరు వరలక్ష్మి, రాజకుమారి, మరపట్ల ఇందిర, దుర్గారావు, అయినపర్తి శ్రీనివాసరావు, గేలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పూర్తి కావస్తున్న రోడ్డు కం రైల్ వంతెన మరమ్మతులు



కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య రోడ్డు కం రైలు వంతెనపై పూర్తయిన తారు రోడు

**కొవ్వూరు:** రాజమహేంద్రవరం- కొవ్వూరులను కలిపే రోడ్డు కం రైలు వంతెన మరమ్మతులు పూర్తి కావస్తున్నాయి. ఈ పనుల కోసం సెప్టెంబర్ 27 నుంచి వంతెనపై రాకపోకలను మూసివేశారు. రూ.2.10 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు ఈనెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ఇంకా పూర్తి కాలేదు. నవంబర్ పదో తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఈనెల 24 నుంచి తారురోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దాదాపు అర కిలో మీటరు మినహా రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. పెయింటింగ్, రోడ్డు మార్కింగ్ వంటి పనులను చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఫుట్‌ఫాత్‌లపై దుమ్ము, మట్టిని కూలీలు శుభ్రం చేస్తున్నారు.రాజమహేంద్రవరం వైపు కొంత భాగం తారురోడ్డు నిర్మాణంతో పాటు జాయింట్ల వద్ద పనులు కొనసాగుతున్నాయి. జాయింట్ల వద్ద జియోగ్లాస్ గ్రిడ్‌లకు చెందిన ప్రత్యేక మరమ్మతులు చేస్తున్నారు. వంతెనపై కురిసే వర్షపు నీరు దిగువకు వెళ్లేందుకు అనువుగా ఎక్కడికక్కడే రంధ్రాలు ఏర్పాటు చేస్తున్నారు.అప్రోచ్ రోడ్లులతో కలిపి 4.473 కిలోమీటర్ల పొడువునా తారురోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర నిర్మాణం పూర్తి చేశారు.

### స్పందనకు 17 అర్జీలు

**కొవ్వూరు:** స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 17 అర్జీలు అందాయి. తమ పొలం రీ సర్వే చేయాలని, కొవ్వూరు నుంచి వేములూరు మీదుగా చిన వాడపల్లికి బస్సు సర్వీసు నడపాలని, కాలువ గట్టు ఆక్రమణలను తొలగించాలని అర్జీదారులు కోరారు. అలాగే ఇళ్ల మంజూరు చేయించాలని, డంపింగ్ యార్డు నుంచి వెలువడే కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని మరికొందరు కోరారు. కోర్టు ఆదేశాల ధిక్కరణపై చర్యలు తీసుకోవాలని మరొకరు విజ్ఞప్తి చేశారు. డీఎల్‌డీవో శాంతమణి, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆర్బీకేలతో సాగు, అనుబంధ రంగాలకు మేలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కవులూరులో రైతు భరోసా కేంద్రం భవనం ప్రారంభం



కవులూరులో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**నల్లజర్ల:** వ్యవసాయ, అనుబంధ రంగాలకు రైతుభరోసా కేంద్రాలు కీలకంగా మారాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కవులూరు గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. విత్తన ఎంపిక నుంచి పంట విక్రయం వరకూ అన్ని సేవలూ సొంత గ్రామంలోనే రైతులకు ఆర్బీకేల ద్వారా అందుతున్నాయన్నారు. ఎరువుల అమ్మకాలతో ప్రైవేట్ డీలర్ల అక్రమాలు అదుపులోకి వచ్చాయన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దళారుల బాధ తప్పిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, ఏవో కమల్‌రాజ్, కవులూరు, నబీపేట సర్పంచులు మద్దిపాటి శ్రీనివాసరావు, గోతం సత్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గారపాటి ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, మద్దిపాటి ప్రసాద్, బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అవసరాన్ని ప్రజలకు వివరించండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- 'వై ఏపీ నీడ్స్ జగన్' నిడదవోలు మండల స్థాయి అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**నిడదవోలు:** రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు భవిష్యత్తులోనూ ఎంతో అవసరమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై నిడదవోలు మండల స్థాయి అవగాహన సదస్సును సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. నవంబర్ 9 నుంచి ప్రారంభం అయ్యే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా ఎల్ఈడీ టీవీ తెరపై గ్రామాల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని అంకెలు, ఫొటోలతో సహా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో చేపట్టిన విప్లవాత్మక చర్యలపై గ్రామాల్లో చర్చించాలని సూచించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పుకొట్టాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో కలిసి నవంబర్ 9వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ వెళ్లాలని సూచించారు. ఆయా ఇంటి వారు పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రతి ఇంట్లో కనీసం 10 నిమిషాలు గడపాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముళ్ళపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగల పోలయ్య, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, మానుకొండ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై



పోటీలకు ఎంపికైన నల్లజర్ల విద్యార్థులతో నీరుకొండ జయకృష్ణ, హెచ్‌ఎం కోమలీచిత్ర



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన వేగేశ్వరపురం విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో బాలామణి

**నల్లజర్ల:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం సీహెచ్ కోమలీచిత్ర తెలిపారు. ఈనెల 27న తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్- 14 ఖోఖో లో మైనం దుర్గాభవాని, అండర్–17 చెస్‌లో చోడిశెట్టి సచిన్ ఉమ్మడి పశ్చి గోదావరి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ టి.త్రిపుర స్వాతిలను సోమవారం స్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, హెచ్‌ఎం కోమలీచిత్ర అభినందించారు.

**వేగేశ్వరపురం హైస్కూల్ నుంచి ఆరుగురు..**

**తాళ్లపూడి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని మండలంలోని వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో సీహెచ్ బాలామణి సోమవారం తెలిపారు. అండర్ -14 బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు 6వ తరగతి విద్యార్థిని రాగనందిని ఎంపికై ందన్నారు. త్రోబాల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు టెన్త్ విద్యార్థులు పి.శివ సాయి, వి.దుర్గాప్రసాద్, పి.పూజిత, 9వ తరగతి విద్యార్థిని జి.లక్ష్మీప్రియ, 8వ తరగతి విద్యార్థిని గాయత్రి ఎంపికయ్యారన్నారు. వారిని, వ్యాయమోపాధ్యాయులు రామచల్లయ్య, కె. లక్ష్మణ్ కుమార్‌లను హెచ్‌ఎం అభినందించారు.

# టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

**పెరవలి:** మండలంలోని కానూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ఈ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అదేగ్రామానికి చెందిన ఆ రెండు పార్టీల నాయకులు బావన రవికుమార్, మత్తి సత్తిపండు, బావన బాబు, యలమెల్లి నాగేశ్వరరావు, జీడిగుంట అర్జున్, పాలంగి కిరణ్, మత్తి సురేష్, బావన మోహన్, జీడిగుంట భీమారావు, భావన ప్రహ్లాదుడు, జీడిగుంట నాని, మత్తి నాగరాజు, బల్లా బాబులు ఎమ్మెల్యే వద్దకు వచ్చి ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అందుకే. తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా నిడదవోలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన



ఒకటో వార్డులో మంచినీటి పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**నిడదవోలు:** అభివృద్ధి అంటే నిడదవోలు నియోజకవర్గం గుర్తుకు వచ్చేలా భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలో రూ.1.66 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఒకటో వార్డు బాలాజీ నగర్‌లో రూ.16.03 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదే వార్డులో రూ.5 లక్షలతో నిర్మించే మంచినీటి పైప్‌లైన్ పనులకు, విద్యానగర్‌లో రూ.14.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అలాగే ఒకటో వార్డులో ఎంపీ రోడ్డు పడమర వైపున రూ.22.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రెండో వార్డు, పాలకోడేటి వారి వీధిలో రూ.12.47 లక్షలతో నిర్మించిన డ్రైన్‌ను, 12వ వార్డు బసివిరెడ్డిపేటలో రూ.11.56 లక్షలతో నిర్మించిన డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే బసివిరెడ్డిపేటలో రూ.37.87 లక్షలతో నిర్మించే డ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. 27వ వార్డు బాలాజీనగర్‌లో రూ.11.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ కార్యదర్శి ముంగండి కృపానందం, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, చిలకల శారదాదేవి, మేడపాటి సరితాదేవి, పడాల శిరీష ,మునిసిపల్ డీఈ మాధవీలత, ఏఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

### జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలో తెలుగు మహాసభలు

**నల్లజర్ల:** వచ్చే ఏడాది జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్టు మహాసభల కో-ఆర్డినేటర్, గజల్ శ్రీనివాస్ సోదరుడు శ్రీరామ్ వెల్లడించారు. సోమవారం దూబచర్ల గ్రామంలోని సంఘ మిత్ర స్కూల్లో గోపాలపురం నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రతి స్కూల్ నుంచి ప్రతిభ గల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. శ్రీరామ్‌తో పాటు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కార్యదర్శి పెనకటి శివాజీ, గోపాలపురం జోన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, కార్యదర్శి ఆత్కూరి సుధీర్‌కుమార్, కోశాధికారి ఏడుకొండలు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థిని మృతి

**పెంటపాడు:** అలంపురం శివారు హైవేపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంకు చెందిన పాతూరి ఉదయ హరిణి (19) పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. సోమవారం స్నేహితుడైన హర్షతో కలిసి బైక్‌పై తణుకులో పుట్టినరోజు వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా అలంపురం శివారులో బైక్ అదుపుతప్పి ఇద్దరూ కిందపడిపోయారు. ఉదయహరిణి, హర్షకు గాయాలయ్యాయి. వీరిద్దరిని స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో తణుకు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉదయహరిణి మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.